అలాంటి వారి దగ్గర మనం ఎంత చీప్‌గా ప్రవర్తించినా ఫర్వాలేదా? ఇక్కడ మాత్రం అలా ప్రవర్తించకూడదు! ఎందుకంటే ఇక్కడంతా ఖరీదైన మనుషులు, ఎ.సి. షోరూమ్‌లో అందంగా హుందాగా కనిపించే మనుషుల మధ్య ఎక్కడ తమ మధ్యతరగతి మనస్తత్వం బయటపడుతుందేమోనన్న భయం!

ఈ విషయాలన్నీ తన భార్యతో వాదించినా ఆమెకర్థం కాదు. ఏమిటో ఈ ఆడాళ్ల మనస్తత్వం! అనుకుంటూ, ఉస్సూరంటూ చీర ఖరీదు చెల్లించి, షాపు నుంచి బయటపడ్డాడు పాపం రామారావు.

-డి.సత్యారావు (విశాఖపట్నం)

# జీవించండి నిండు నూరేళ్లు

ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న రాజారావుగారు ద్వారం దగ్గర ఉన్న రాడ్‌ని పట్టుకుని వేలాడుతున్న ఒక కుర్రాడిని చాలాసేపట్నుంచి గమనిస్తున్నాడు. అప్పటికి కండక్టరు అతన్ని 'లోపలికి రమ్మని' చాలాసార్లు రిక్వెస్ట్ చేశాడు. అయినా కేర్‌లెస్‌గా బస్సు నుండి బయటకి గాల్లో వేలాడుతూనే ఉన్నాడు. రాజారావుగారికి ఆ దృశ్యం చూస్తుంటే ఒళ్లు జలదరిస్తోంది. పొరబాట్న పక్క నుండి వెళ్లే ఏ వాహనమైనా గుద్దిందంటే ఇంకేమైనా ఉందా? అయినా అలా ప్రయాణించడంలో వాళ్లకొచ్చే ఆనందమేమిటి? రన్నింగులో బస్సులు ఎక్కడం..దిగడం.. ఫుట్‌బోర్డు దగ్గర అలా అడ్డంగా నిలబడి వచ్చే పోయే వారికి తీవ్ర ఇబ్బందిని కలిగిస్తూ తమ ప్రాణాలని గాల్లో నిలిపి ప్రయాణించడంలో వాళ్లకి లభించే తృప్తి ఏమిటి? థ్రిల్ ఏమిటి?

రాజారావుగారు నెమ్మదిగా లేచి ఆ కుర్రాడి దగ్గరకెళ్లి "బాబూ నీ పేరేమిటి?" అని అడిగాడు.

"నీకెందుకు?"

ఆయన నవ్వి "నిజమే నాకెందుకు? కానీ నీతో మాట్లాడదామనుకుంటున్నాను. దయచేసి రేపు ప్రభుత్వాసుపత్రి ముందు ఉన్న ప్రెస్‌కి ఉదయం తొమ్మిది గంటలకు రా. నీకు ఉపయోగపడేదేలే. ఖచ్చితంగా రా సరేనా?" అని చెప్పి బస్సు దిగి వెళ్లిపోయాడు.

ఆ కుర్రాడికి చాలా చిత్రంగా అనిపించింది. 'ఎప్పుడూ ఫుట్‌బోర్డ్ ప్రయాణం చేసే తనని అందరూ తిట్టడమే తప్ప ఇలా మంచిగా ఎవరూ మాట్లాడలేదు. నిజంగా ఉపయోగపడేదేమో వెళ్తేపోలా' అనుకున్నాడు.


* * *

రాజారావుగారు ఫణిభూషణరావుగారితో కారులో వెళుతున్నాడు. హైద్రాబాద్‌లోని ఇండస్ట్రియలిస్టుల్లో ఫణిభూషణరావుగారొకరు. అనాథ శరణాలయాలకి నిధులివ్వడంలో ఆయన చేతికి ఎముక ఉండదు. ఇపుడు ఆ పనిమీదే ఆయనతో వెళుతున్నాడు రాజారావుగారు. కారులో ప్రయాణిస్తూ చాలాసేపట్నుంచి ఆయనో కుర్రాడిని గమనిస్తున్నాడు. పాతికేళ్ల వయసు ఉంటుంది. కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన బైకుని యమా స్పీడుగా డ్రైవ్ చేస్తున్నాడు. వాహనాల మధ్య నుండి పాదరసంలా దూసుకుపోతూ మృత్యువు నుండి వెంట్రుకవాసిలో తప్పించుకుంటున్నాడు. రాజారావుగారు కారు డ్రైవర్‌కి ఆ కుర్రాడిని చూపించి అతడి బండిని ఎలాగయినా చేజ్ చేసి అతడిని నిలవరించాలని చెప్పాడు. డ్రైవరు చాకచక్యంగా కారు నడిపి ఆ బైకుకి అడ్డం పోనిచ్చి ఆపాడు. రాజారావుగారు కారు దిగి "బాబూ నీ పేరేమిటి?" అని అడిగాడు.

హెల్మెట్‌కున్న గ్లాసు కొద్దిగా తొలగించి 'వెంకట్' అని నిర్లక్ష్యంగా చెప్పి "ఎందుకు?" అడిగాడు.

"మరేం లేదు బాబు.. నీలా బైకు డ్రైవ్ చేసే డేరింగ్ కుర్రాడు కావాలి టీవీ యాడ్‌లో నటించడానికి. అందుచేత రేపు ఉదయం తొమ్మిది గంటలకి నువ్వు ప్రభుత్వాసుపత్రి ముందు ఉన్న ప్రెస్‌కి రా. మర్చిపోకు" అని కారెక్కాడు.

తను బైకు నడపడం చూసిన పెద్దవాళ్లయితే 'ఇలాగయితే నువ్వు ఎక్కువ కాలం బ్రతకవు' అని శాపనార్థాలు పెట్టడం.. ఫ్రెండ్స్ అయితే 'ఏమి స్పీడు బాస్ నీది ఎవ్వరూ అందుకోలేరు' అని పొగడ్డం గుర్తుకొచ్చింది. 'కానీ ఈ పెద్దాయన ఏకంగా టీవీ యాడ్‌లో నటించే అవకాశం ఇస్తానంటున్నాడు. ఇంకేం కావాలి' బైకుని ముద్దు పెట్టుకుని ముందుకురికించాడు.



* * *

మరునాటిరోజు ఉదయం తొమ్మిది గంటలు.

ప్రభుత్వాసుపత్రి ముందున్న ప్రెస్ ముందు నిన్నటి ఇద్దరు కుర్రాళ్లతో పాటు అనేక కారణాల వల్ల క్షణికావేశంలో చచ్చిపోదామనుకున్నవారు, ప్రేమలో విఫలమై మరణాన్ని ఆహ్వానిద్దామనుకున్నవారు, పరీక్షలో ఫెయిలై జీవితం అంతం చేసుకోవాలనుకున్నవారు..ఇలా చాలా మంది ఉన్నారు. రాజారావుగారు తన మీద తన మాట మీదా గౌరవంతో అక్కడకి వచ్చినందుకు అందర్నీ అభినందించి ప్రభుత్వాసుపత్రిలోకి తీసుకెళ్లారు.

ఆ ముసలాయన తమనలా ప్రభుత్వాసుపత్రిలోకి ఎందుకు తీసుకెళుతున్నాడో వాళ్లకి అర్థం కాలేదు. అయినా వెంట వెళ్లారు.

మొదటగా అధికమోతాదులో విషం తీసుకుని మృత్యువుతో అవిశ్రాంతంగా పోరాడుతున్న ఓ పేషెంటునీ.. అతడిని కాపాడడానికి తీవ్రంగా కృషి చేస్తున్న డాక్టర్లనీ చూపించాడు. ఆ తర్వాత బర్న్ వార్డ్‌కి తీసుకెళ్లి ఎనభై..తొంభై శాతం కాలిపోయినా బ్రతకాలన్న ఆశతో మృత్యువుని ఎదిరిస్తున్న వాళ్లని.. యాక్సిడెంట్లో అంగాలు కోల్పోయినవాళ్లనీ.. ఫుట్‌బోర్డ్ ప్రయాణాల్లో తీవ్రంగా గాయపడిన వాళ్లని.. మెదడుకి దెబ్బ తగిలి సర్వం కోల్పోయిన వాళ్లనీ.. కేన్సర్‌తో బాధపడుతూ నిరాశతో చావుకోసం ఎదురుచూస్తున్నవాళ్లని.. డయాలసిస్ చేయించుకుంటున్నవాళ్లని.. ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులనీ చూపించాడు రాజారావుగారు.

వాళ్లందర్నీ చూశాక ఆయనతో పాటు వచ్చిన వాళ్లకి హృదయం ద్రవించిపోయింది. కళ్లలో నీళ్లు తిరిగాయి.

"చూశారా.. వీళ్లను చూస్తుంటే మీరు ఎంత నిర్లక్ష్యంగా జీవిస్తున్నారో అర్థమైందా. ఒకరోజు తప్పుకున్నా మరో రోజు మృత్యువు మిమ్మల్ని కబలిస్తుంది. నవమాసాలు మోసి కని అష్టకష్టాలు పడుతూ పెంచి..చదివించి ఇంతటివాళ్లని చేస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అమూల్యమైన ప్రాణాలని కోల్పోవడం సమంజసమేనా? మీమీదే ఆశలు పెట్టుకుని జీవిస్తున్న వాళ్లకి అంగాలు కోల్పోయిన లేదా ప్రాణం లేని దేహాన్ని ఇస్తారా? చూశారుగా ఇక్కడ ఎంతమంది మృత్యువుతో ఒంటరి పోరాటం చేస్తున్నారో. ఇక్కడి డాక్టర్లు ఎంత కష్టపడినా ఒక్కోసారి మరణాన్ని నియంత్రించలేకపోవచ్చు. దురదృష్టవశాత్తు ఏ కేన్సరో ఎయిడ్సో వస్తే వేరు కానీ మీ అంతట మీరు కోరి మృత్యువును ఆహ్వానిస్తున్నారు. ఇక్కడి వాళ్లని చూస్తే జీవితం విలువ అర్థమయింది కదా.. పదికాలాల పాటూ జీవించండి. పది మంది శ్రేయస్సు కోసం పాటుపడండి" అని ముగించాడు.

వాళ్లలో పరివర్తన వచ్చింది. ఇహ వాళ్లు నిండు నూరేళ్లు బ్రతుకుతారు.

-ప్రతాప వెంకటసుబ్బారాయుడు